క్లుప్తంగా

ఫ్యాన్ ప్రభంజనం ఖాయం



దిప్పకాయలపాడులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కొయ్యలగూడెం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అఖండ విజయం ఖాయం అని, ఫ్యాన్ ప్రభంజనానికి తిరుగుండదని ఆ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు గొడ్డటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. గ్రామంలో బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. సంక్షేమ పాలన అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 18 పంచాయతీలకు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఇన్‌ఛార్జ్‌లను నియమించడం జరిగిందని వారి పర్యవేక్షణలో గ్రామ పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ కన్వీనర్ నూనె నాగు, మంగపతిదేవిపేట ఎంపీటీసీ తేలే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలి



జెడ్పీ చైర్మన్ పద్మశ్రీ ప్రసాద్‌ను కలిసిన గోపాల్‌యాదవ్

కామవరపుకోట: ఏలూరు పార్టీ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ గంటా పద్మశ్రీ ప్రసాద్‌ను మండలంలోని కంటమనేనివారిగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు గొరుముచ్చు గోపాల్‌యాదవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ కోరినట్లు గోపాల్‌యాదవ్ తెలిపారు.

ఘనంగా రాములోరి విగ్రహ ప్రతిష్ఠ



లింగపాలెంలో రాములోరి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పూజలు చేస్తున్న భక్తులు

లింగపాలెం: లింగపాలెంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో గురువారం ఉదయం 9.32 గంటలకు రాములోరి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకుల వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

రామాలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



దాత బీవీఎస్ రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

లింగపాలెం: లింగపాలెంలో రామాలయ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నేత, మైత్రి డెవలపర్స్ అధినేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్ రెడ్డి) రూ.5,00,116 విరాళం అందజేశారు. ఈమేరకు గురువారం ఆలయంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు కలిసి దాత బీవీఎస్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. తన వంతుగా గ్రామాల్లో ఆలయ నిర్మాణాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బీవీఎస్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి శంకుస్థాపన



శివాలయంలో రాజగోపుర నిర్మాణానికి శంకుస్థాపన పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: అంకాలగూడెంలోని స్వయంభు శ్రీ ఉమా సమేత భోగలింగేశ్వర స్వామి ఆలయ రాజగోపుర నిర్మాణానికి గురువారం తెల్లవారుజామున శంకుస్థాపన పూజలు నిర్వహించారు. అర్చకులు మామిళ్ళపల్లి శివానంద ఆచార్యులు, సుబ్రహ్మణ్యశర్మ, దేసీతారాంల ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర, వాస్తు పూజలు, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన కోసం జగన్‌ను గెలిపించాలి

- వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కంభం విజయరాజు, కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్
- జంగారెడ్డిగూడెంలో ఎన్నికల ప్రచారం





ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కంభం విజయరాజు, కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, ప్రచారంలో భాగంగా దుస్తులు కుడుతున్న కంభం విజయరాజు

జంగారెడ్డిగూడెం: కుల, మత, రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, సంక్షేమ పాలన కోసం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని ఆ పార్టీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెంలో గురువారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆత్మీక కలయిక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ పాలనలో అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా ఆర్‌బీకేలు, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్‌లు, నాడు–నేడు ద్వారా విద్యాభివృద్ధి, రోడ్లు, పట్టణాల సుందరీకరణ నిలుస్తున్నాయన్నారు. పాఠశాలలను ఆధునీకరించడం, డిజిటల్ క్లాస్‌రూమ్, కంప్యూటర్ విద్య, ఇంగ్లీష్ మీడియం తదితర వాటితో కార్పొరేట్ కన్నా అద్భుతంగా మార్చారని కొనియాడారు. పేదరికాన్ని నిర్మూలించి మట్టిలో మాణిక్యాన్ని వెలికితీడమే ధ్యేయంగా జగన్ విద్యాభివృద్ధికి కృషిచేస్తున్నారన్నారు. పేదవాడి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వైఎస్ జగన్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రెండు సార్లు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్టీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో 4వ వార్డు ఇందిరానగర్ కాలనీ, కొత్తపేట, 6వ వార్డులో రామాలయ చైర్మన్ పాములపర్తి ఇంటి వద్ద నుంచి బందులదొడ్డి సెంటర్ వరకు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీఆర్ చౌదరి, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి సోంబాబు, నాయకులు మేడవరపు విద్యాసాగర్, ముప్పిడి శ్రీను, కౌన్సిలర్లు పీపీఎస్ చంద్రరావు, ఉగ్గం దుర్గాప్రసాద్, అయినాల వెంకటరమణమూర్తి, సంకు సురేష్, నేకూరి కిషోర్, నాయకులు బత్తిన చిన్న, సోమేశ్వరరావు, అమ్మ నిలయం శ్యామ్, గెద్దాడ శ్రీను, షేక్ అమీర్, పఠాన్ పర్వీజ్, మహమ్మద్ కబీర్, మహమ్మద్ ఆఫీస్, పళ్ళ వెంకటరమణ, గగ్గల కిరణ్ కుమార్, మద్దిపాటి శ్రీను, మల్లవరపు నాగపాసు, వసంతాటి మంగరాజు, మహమ్మద్ జమీర్, మహమ్మద్ బాషా, షేక్ షరీఫ్, శుద్ధపల్లి సుబ్బారావు, పోలిపోయిన సత్యనారాయణ, కూనపాము పండు, మరపట్ల శ్రీను, చిప్పాడ గంగరాజు, అడ్డాల శీను, మలువలస సాయి సింహ, సిలార్పు మంగారావు, ప్రశాంత్, ఎస్ ఆనంద్, తీయాల పైడ్రాజు, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి
- కుక్కునూరు మండలంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి



కుక్కునూరు మండలంలో గిరిజనులతో బాలరాజు, రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: నవరత్న పథకాల అమలుతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి కోరారు. కుక్కునూరు మండలం పెద్దరావిగూడెం, అమరవరం, సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో గురువారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నిర్వాసితులకు అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే 45.15లో ఉన్న నిర్వాసితులు తమను 41లో కలిపే విధంగా కృషి చేయాలని పలువురు కోరారు. అదేవిధంగా ఆర్ అండ్‌ఆర్‌కు సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే బాలరాజు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలవరం ప్రాజెక్టు, నిర్వాసితుల సమస్యలను రెండు కళ్లుగా భావిస్తున్నారని అన్నారు. నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో అనేకసార్లు మాట్లాడడం జరిగిందని అన్నారు. అయితే ప్యాకేజీ సొమ్ము చెల్లింపుపై జరిగిన జాప్యంపై జగనన్న వరద సమయంలో గొమ్ముగూడెంలో పర్యటించిన సందర్భంగా క్షమాపణ కోరిన విషయాన్ని గుర్తుచేశారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వాసితుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని అన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. పూలమాలలు వేసి గ్రామాల్లో ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో ప్రచారం హోరెత్తింది. జై జగన్, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ–2 గాడిద రామచంద్రం, సర్పంచ్ రావు మీనా, పార్టీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, నాయకులు రావు వినోద్, కుచ్చర్లపాటి కృష్ణంరాజు, పర్సా శ్రీహరి, కొమ్ము వీరబాబు, కోటగిరి నళిని ప్రవర్‌కుమార్, ఆవుల బాలకృష్ణారెడ్డి, పర్సా రామిరెడ్డి, గంగుల రమణారెడ్డి, ఆచంట మాధవరావు, కోలాగాని వెంకట్రావు, ఎల్లంకి లక్ష్మణరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

'పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం'

ఏలూరు టౌన్: పోలీస్ కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి అన్నారు. జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ ఎస్ వెంకటేశ్వరరావు కుటుంబానికి గురువారం ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు అదనపు కార్పస్ ఫండ్ నుంచి రూ.1 లక్ష చెక్‌ను అదనపు ఎస్పీ స్వరూపరాణి అందించారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

జంగారెడ్డిగూడెం రూరల్: మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో భాగంగా జంగారెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్ తెలిపారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘన ఎక్కడైనా జరిగితే వెంటనే కంట్రోల్ రూమ్‌కి తెలియజేయాలన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో, తహసీల్దార్

జంగారెడ్డిగూడెం: ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ కె.స్లీవజోజి, నోడల్ అధికారి, ఎంపీడీవో కేవీ ప్రసాద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు, ప్రజలను భాగస్వామ్యం చేసేలా ఎన్నికల కమిషన్ సీ–విజిల్ అనే ఆండ్రాయిడ్ యాప్‌ను సిద్ధం చేసిందన్నారు. ఈ యాప్‌ను ప్రజలు వారి మొబైల్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకుని ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా జరిగే కార్యక్రమాలు చిత్రీకరించి అప్‌లోడ్ చేయవచ్చన్నారు. సదరు కోడ్ అతిక్రమణకు సంబంధించి స్థానికంగా ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ సంబంధిత ఘటనా ప్రాంతానికి చేరుకుని విచారణ నిర్వహించడంతో పాటు, ఎన్నికల కోడ్ అతిక్రమణ ధ్రువీకరిస్తే చర్యలు తీసుకుంటారన్నారు. మద్యం, డబ్బులు పంచడం, రాజకీయ నాయకులు ఇతర పార్టీలపై దుర్భాషలాడటం, మత పరమైన విషయాలు మాట్లాడటం, అనుమతులు లేకుండా ప్రచారాలు చేయడం తదితర చర్యలు ద్వారా ప్రజల్లోని భావోద్వేగాలను రెచ్చగొట్టడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు చేపడితే వెంటనే ప్రజలు ఆండ్రాయిడ్ ఫోన్‌లో సీ – విజిల్ ద్వారా 2 నిమిషాల వీడియో గాని, ఆడియో లేదా ఫోటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకుని చర్యలు తీసుకుంటారని, అలాగే సంబంధిత రిటర్నింగ్ అధికారికి తెలియజేస్తారన్నారు. రిటర్నింగ్ అధికారి పరిశీలించి కలెక్టర్‌కు నివేదిస్తారన్నారు. సీ–విజిల్ యాప్‌లో నమోదైన 100 నిమిషాల్లో పూర్తి చర్యలు ఉంటాయన్నారు. మండలంలో 4 సందర్భాలలో కోడ్ ఉల్లంఘన జరిగితే వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకున్నామన్నారు. సీ–విజిల్ యాప్‌కు సంబంధించి కలక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రజలు సమాచారాన్ని పూర్తి ఖచ్చితత్వంతో మాత్రమే అప్‌లోడ్ చేయాలన్నారు. అసంబద్ధ, అసంపూర్తి సమాచారాన్ని సీ–విజిల్‌లో నమోదు చేయవద్దని సూచించారు.

ఘనంగా కండిగలమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ





కండిగలమ్మ అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పిస్తున్న శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలు వెంకటకొండ పద్మ జ్యోతి, తదితరులు, ఆలయం జరుగుతున్న ఏక శిల ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ద్వారకాతిరుమల: మండలంలోని గుండుగొలనుకుంటలో చిలుకూరి ధర్మారావు తోటలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ కండిగలమ్మ అమ్మవారు, పోతురాజు స్వామివార్ల విగ్రహ, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, పురోహితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఉదయం 9.41 గంటల సుముహూర్త సమయంలో నూతన ఆలయంలో కండిగలమ్మ అమ్మవారు, పోతురాజు స్వామివార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అలాగే ఆలయం ముందు 40 అడుగుల ఏకశిల ధ్వజస్తంభాన్ని, ఆలయ గోపురంపై శిఖరాన్ని ప్రతిష్ఠించారు. ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలు పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, జ్యోతి శ్రీనివాస్ దంపతులు, గుండుగొలనుకుంట సర్పంచ్ బండారు ధనలక్ష్మి, కాశీ దంపతులు, అలాగే ద్వారకాతిరుమల మాజీ సర్పంచ్ మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, చిలుకూరి నాగవెంకట ఫణికుమార్ అమ్మవారికి పట్టు వస్త్రాలు, పూలు, పండ్లు, పసుపు, కుంకుమలను సమర్పించారు. వాటిని ఆలయ నిర్మాణకర్త ధర్మారావుకు అందించారు. ఈ వేడుకల్లో ద్వారకాతిరుమల, గుండుగొలనుకుంటకు చెందిన పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని, స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి

ఐటీడీఏ పీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యతేజ



విలేకర్లతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు, వారి ప్రజాప్రతినిధులు ప్రచార కార్యక్రమాలకు సంబంధించి ముందస్తు అనుమతులు పొందడానికి సువిధ పోర్టల్‌ను వినియోగించుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ కోరారు. గురువారం ఆయన ఛాంబర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, వారి ప్రజాప్రతినిధులు నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇంటింటా ప్రచారం, కరపత్రాల పంపిణీ, తదితర ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతి పొందాలని అన్నారు. అనుమతి లేకుండా ప్రచారం నిర్వహిస్తే కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని చెప్పారు. అదేవిధంగా సీ – విజిల్ ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో 16 వరకూ ఫిర్యాదులు పరిష్కరించినట్లు చెప్పారు. అలాగే ఎన్నికల కోడ్ పక్కాగా అమలు జరిగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 8 బృందాల ద్వారా గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. అంతరరాష్ట్ర చెక్‌పోస్ట్ నుంచి మద్యం, నగదు, మాదకద్రవ్యాల రవాణా అరికట్టే విధంగా నిఘా పెంచినట్లు తెలిపారు. ఇప్పటికే రెవెన్యూ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించామని చెప్పారు. అలాగే గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలపై కూడా చర్యలు తీసుకునే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు.

ప్రతి పాఠశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేయాలి

దెందులూరు: జిల్లాలో అన్ని ఉన్నత పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం అన్నారు. ఈ కమిటీలో హెచ్‌ఎం, పీఈటీ, సైన్స్ టీచర్ ఉండేలా చూడాలన్నారు. గురువారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం శర్మ అధ్యక్షతన ఆరు మండలాల్లో పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లకు మాదక ద్రవ్యాల వినియోగం, నష్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. స్పెషల్ బ్రాంచ్ ఎస్సై శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు రేషన్ బియ్యం సక్రమంగా అందించాలి



కేఆర్‌పురం ఐటీడీఏలో జీసీసీ అధికారులతో మాట్లాడుతున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: నదీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు బియ్యం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ అన్నారు. ఐటీడీఏలోని తన ఛాంబర్‌లో జీసీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీసీసీ ద్వారా జరుగుతున్న అమ్మకాలు, ఉత్పత్తుల గురించి రంపచోడవరం జీసీసీ డీఎం, కేఆర్‌పురం జీసీసీ ఇన్‌చార్జి మేనేజర్ జి. పార్వతీశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేలేరుపాడు మండలంలోని నదీ పరివాహక గ్రామాలుగా ఉన్న పేరంటాపల్లి, కాకిస్నూరు, టేకులపల్లి గ్రామాలకు బియ్యం సక్రమంగా అందడంలేదని తన దృష్టికి వచ్చిందని అన్నారు. ఆయా గ్రామాలకు తరలించే బియ్యాన్ని కొయిదా గ్రామంలో ఉంచి అక్కడి నుంచి పడవల్లో తరలిస్తున్నామని జీసీసీ అధికారులు తెలిపారు. కాకిస్నూరులో 98, టేకులపల్లి 64, పేరంటాలపల్లి 58 చొప్పున మొత్తం 219 రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. అలాగే మోదేలు గ్రామంలో కూడా 17 కార్డులు ఉన్నాయని చెప్పారు. ఆయా గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులకు రేషన్ బియ్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలని పీఓ కోరారు. ఈ కార్యక్రమంలో చింతూరు డీసీసీ డీఎం సీహెచ్ మధు, కేఆర్‌పురం జీసీసీ అకౌంటెంట్ సీహెచ్ రాజయోగి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ నిల్వలపై కఠిన చర్యలు



పట్టుబడిన మద్యం, నాటుసారాను ధ్వంసం చేస్తున్న చింతలపూడి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

చింతలపూడి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మద్యం విచ్చలవిడి పంపిణీ లేకుండా కఠిన చర్యలు చేపట్టినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె రామకృష్ణ తెలిపారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం చింతలపూడిలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. జిల్లాలో అక్రమ మద్యం నిల్వలు, మద్యం పంపిణీపై నిఘా పెట్టినట్లు చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలంటే ప్రజల సహకారం అవసరమన్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం నిల్వ చేయడం, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం దిగుమతి చేయడం నేరమన్నారు. నాటు సారా తయారీ, అక్రమ మద్యం రవాణా, విక్రయాల గురించి సమాచారం తెలిస్తే 94409 02428 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతకుముందు ఆంధ్ర, తెలంగాణ పరిధిలోని లింగగూడెం, అల్లిపల్లి, లంకాలపల్లి సరిహద్దు చెక్‌పోస్టులను తనిఖీ చేశారు.

మద్యం, నాటుసారా ధ్వంసం

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె రామకృష్ణ సమక్షంలో 64 కేసుల్లో పట్టుబడ్డ 935.8 లీటర్ల నాటు సారా, 45 కేసుల్లో పట్టుబడిన 380.97 లీటర్ల మద్యంను సర్కిల్ కార్యాలయం ఆవరణలో స్థానిక అధికారులు ధ్వంసం చేశారు. ఆయనతో పాటు సీఐ డీఎస్ఎస్‌వీ ప్రసాద్, ఎస్సైలు పి.లక్ష్మణరావు, ఆర్.మోహన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

పోలీసుల కవాతు



అల్లంచర్ల రాజుపాలెంలో పోలీసుల కవాతు

టి.నరసాపురం: ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషిచేస్తున్నట్లు జీలుగుమిల్లి సీఐ టి.క్రాంతికుమార్, టి.నరసాపురం ఎస్సై దుర్గా మహేశ్వరరావు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా టి.నరసాపురం మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో గురువారం సాయంత్రం పోలీసు బెటాలియన్‌తో కవాతు నిర్వహించారు. మండలంలోని బందంచర్ల, కేతవరం, అల్లంచర్ల రాజుపాలెం, వెలగపాడు, టి.నరసాపురం గ్రామాల్లో ఈ కవాతు నిర్వహించి, ప్రజలకు భరోసా కల్పించారు. ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

కొనసాగుతున్న జాతర మహోత్సవాలు



రెడ్డిగణపవరంలో చండీయాగం పూజలు చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు గురువారం మహాచండీయాగం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వైఎస్సార్ సీపీ నేతకు పరామర్శ



కాసర సత్యవతి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కంభం విజయరాజు తదితరులు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ నాయకులు కాసర సోమిరెడ్డిని గురువారం ఆ పార్టీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు పరామర్శించారు. ఇటీవల సోమిరెడ్డి మాతృమూర్తి కాసర సత్యవతి మృతి చెందారు. గురువారం జంగారెడ్డిగూడెం వచ్చిన విజయరాజు, సోమిరెడ్డి నివాసానికి వెళ్లి సత్యవతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె మృతి పట్ల సంతాపాన్ని తెలియజేశారు. విజయరాజు వెంట జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీఆర్ చౌదరి, పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి సోంబాబు, పార్టీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, నాయకులు చిప్పాడ వెంకన్న, దోనేపూడి రమణ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



బార్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముళ్ళపూడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా వై.సుగుణకుమారి, జనరల్ సెక్రటరీగా విత్తనాల రాజు, జాయింట్ సెక్రటరీగా కె.వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఎస్.ఆనంద్, ట్రెజరర్‌గా పి.పెద్దిరాజు, లైబ్రరీ సెక్రటరీగా డీకేవీ ప్రసాద్, రిప్రజంటేటివ్‌గా కె.రాజీవ్‌కుమారి ఎన్నికైనట్లు బార్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు, గన్నమని వీవీఆర్ శేఖర్, న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

నాటు సారా విక్రేత అరెస్టు

టి.నరసాపురం: నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం టి.నరసాపురంలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం సిబ్బందితో దాడి చేసి 6 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, విక్రేతపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.